బీసీల కోసం పోరాడే జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా నిలుద్దాం

బడుగులను అవహేళన చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పి తీరాల్సిందేనంటున్న బీసీ సంఘాలు

బడుగుల గొంతుక కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపిద్దామని బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి. రాజకీయాలకతీతంగా బీసీలు ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా.. లోక్‌సభ ఎన్నికల్లో తిప్పికొడతామని స్పష్టం చేస్తున్నారు. బీసీల ఓట్లు లేనిదే ఏ పార్టీకీ మనుగడ ఉండదన్న విషయాన్ని ఈ ఎన్నికల్లో రుజువు చేసి చూపించాలని నేతలు పేర్కొంటున్నారు.

ముఖ్యంగా బడుగులను అవహేళన చేస్తున్న రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేస్తున్నారు. బీసీల శక్తిని, చైతన్యాన్ని ప్రదర్శించి ఆయా పార్టీల నేతల నోళ్లను మూయించాలని చెబుతున్నారు. బీసీల కోసం పోరాడే వ్యక్తులే కరువయ్యారని.. ఈ పరిస్థితుల్లో బీసీల హక్కుల కోసం పోరాడేందుకు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా ఉండాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ)

బడుగుల గొంతుక కాసాని

బీసీ నాయకుడిని గెలిపించుకుందాం

చేవెళ్ల ఎంపీగా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు బీఆర్ఎస్ పార్టీ ఆరు పార్లమెంట్ సీట్లు కేటాయించడం సంతోషకరం. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న కేసీఆర్.. బడుగు, బలహీన వర్గాల నేతకు చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని బీసీ సోదరులంతా సద్వినియోగం చేసుకొని కాసానిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దాం.

- మంగళి కరుణాకర్, కక్కులూర్, షాబాద్ మండలం

చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా చాటాలి

చేవెళ్ల గడ్డపై ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలి. బీసీలంతా ఐకమత్యంగా ఉండి, కాసాని గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి. మన సత్తా ఏంటో ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే బీసీల సమస్యలపై పోరాటం చేస్తారు.

- దయాకర్‌చారి, దామర్లపల్లి, షాబాద్ మండలం

బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే నాయకుడు కాసాని

ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషిచేసి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. కాసాని లాంటి నాయకుడు పార్లమెంట్‌లోకి వెళ్లే నిరుపేదలు అభివృద్ధి చెందుతారు. బీసీలందరూ కలిసికట్టుగా కాసాని జ్ఞానేశ్వర్ వెంటే ఉండాలి. బీసీ నాయకుడిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం.

- ఎం.కిష్టయ్య అంగడిచిట్టంపల్లి, పూడూరు మండలం

జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం

బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీ సామాజిక వర్గానికి మొండిచేయి చూపగా.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి టికెట్ ఇచ్చారు. కాసాని గతంలో ఉమ్మడి రంగారెడ్డిలో అనేక హోదాల్లో బీసీ వర్గాలకు చెందిన నాయకులను చైతన్యపర్చారు. బీసీ మేధావులు, విద్యావంతులు, యువకులు బీసీ అభ్యర్థిని గెలిపించి మన ఐక్యతను చాటాలి.

- జావిద్, మన్నెగూడ, పూడూరు మండలం

బీసీల సత్తా ఏమిటో చూపిద్దాం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మొదటి నుంచి ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అనేక మంది బీసీలకు బీఆర్ఎస్ చేయూతనందించింది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు టికెట్‌ను కేటాయించి బీసీల ఆత్మగౌరవాన్ని నిలిపింది. బీసీలంతా రాజకీయాలకతీతంగా కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- మల్లేశ్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, మణికొండ

రాజకీయాలు పక్కనబెట్టి గెలిపించి చూపిస్తాం

బీసీలను తక్కువ చేసి మాట్లాడిన మోహన్‌రెడ్డిలాంటి వాళ్లు చాలామందే ఉన్నారు. కానీ బీసీల్లో ఐక్యత లోపించింది నిజమే.. ఇకనైనా రాజకీయాలను పక్కనబెట్టి చేవెళ్ల గడ్డపై బరిలో ఉన్న కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని సత్తా చాటుదాం. ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటువేసి మన ఐక్యతను చాటిచెప్పాలి. అగ్రకులాల నేతలు మనందరినీ ఓటు రాజకీయాలకు బలిపశువుల్లా వాడుకుంటున్నారు.

- కొణతం లక్ష్మణ్‌గౌడ్, ఎండీ, కేఎల్ ఇన్‌ఫ్రా, మణికొండ

జ్ఞానేశ్వర్‌తో బీసీల అభివృద్ధి

96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి ఏకతాటిపైకి తీసుకువచ్చిన మహా నేత జ్ఞానేశ్వర్. ఈ ఎన్నికల్లో బీసీలందరం ఏకమై పార్టీలకతీతంగా బీసీ బిడ్డను గెలిపించుకోవాలి. అందుకు కారు గుర్తుకు ఓటు వేసి బీసీల శక్తి, చైతన్యం నిరూపించుకోవాలి. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ పార్టీలు మారే నేతలకు మనం ఓటు వేయొద్దు.

- రాంచందర్, తాండూరు

జ్ఞానేశ్వర్ విజయం ఖాయం

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కేసీఆర్ ప్రతిపాదించిన సందర్భంగా గెలిపించుకుందాం. కాంగ్రెస్, బీజేపీల రెడ్డీ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మన బీసీ ముద్దు బిడ్డను భారీ మెజార్టీతో గెలిపించుకునే తరుణం వచ్చింది. బీసీల ఓట్లతో ఇరు పార్టీల నాయకులకు తగిన గుణపాఠం నేర్పుదాం. ఓటు దెబ్బతో బీసీల ఐక్యతను చాటి మన జ్ఞానేశ్వర్ అన్నను గెలిపించి పార్లమెంట్‌కు పంపుదాం.

- కాశయ్య, బీసీ యువ రైతు, మల్లేపల్లి, దోమ మండలం

బీసీలు సిద్ధం కావాలి

రాజకీయాలకతీతంగా బీసీలు సిద్ధమై బీసీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలి. బీసీలందరూ ఐక్యతగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం. ఇష్టానుసారంగా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలంటే ఏమిటో రుచి చూపించాలి. కాసానిని ఎంపీగా గెలిపించి పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడేట్లు చేయాలి.

- బుడ్డోల్ల నరేందర్‌గౌడ్, గౌడ సంఘం నాయకుడు, కందుకూరు

కాసానిని గెలిపిస్తేనే న్యాయం జరుగుతుంది

బీసీల ఐక్యత లేకుండా ఇతరులు కుట్రలు చేస్తుండ్రు. అన్ని కులాల కంటే బీసీలు ఎక్కువ శాతం ఉన్నారు. బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా అనేక సేవలు చేసిండ్రు. ఆయనను గెలిపిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. కాసానిని గెలిపించి బీసీలంతా ఒక్కటేనని నిరూపిద్దాం.

- కాకి దశరథ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకుడు, కందుకూరు

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం

నిస్వార్థంతో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి నిరంతరాయంగా పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వరన్న గెలుపు ఖాయం. స్వలాభం కోసం పార్టీలు మారి, టికెట్లు తెచ్చుకున్నంత మాత్రాన ప్రజలు ఆదరిస్తారనుకోవడం అవివేకం. తప్పుడు మాటలు, వాగ్దానాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే నాయకులకు ప్రజలు బుద్ధిచెబుతారు.

- నరేందర్ భల్లా, చందానగర్

బీసీ అభ్యర్థిని గెలిపిద్దాం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఎన్నో ఏండ్లుగా ప్రజా క్షేత్రంలో ఉంటూ, బీసీల అభ్యున్నతికి పోరాటం చేస్తున్న వ్యక్తిని పార్లమెంట్‌కు పంపిద్దాం. ప్రజా సేవ చేస్తామంటూ ముసుగేసుకుని తమ వ్యాపారాలను వృద్ధి చేసుకునే మోసగాళ్ల డిపాజిట్లు గల్లంతయ్యేలా.. జ్ఞానేశ్వరన్నను గెలిపిద్దాం.

- ప్రవీణ్, శంకర్‌నగర్, చందానగర్

బీసీల ఐక్యతను చాటుదాం

చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి బీసీల బలం చూపిస్తాం. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలను పట్టించుకోవడంలేదు. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్పా.. వారికి రాజ్యాధికారం ఇవ్వడంలేదు. 96 బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల కోసం పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కింది.

- నర్సింహులు, బొపునారం, బంట్వారం

బీసీ నాయకున్ని గెలిపించుకుందాం

అన్ని ఎన్నికల్లో ఇతర వర్గాల వారికి ఓట్లు వేసిన బీసీలు ఈసారి బీసీ అభ్యర్థికి ఓటు వేసుకునే చక్కటి అవకాశం వచ్చింది. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలి. పార్లమెంటులో తెలంగాణ గొంతుకను వినిపించేలా చేయాలి.

- నర్సింహులు, వికారాబాద్

పూటకో పార్టీ మార్చేవారిని పట్టించుకోవద్దు

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్,ఏప్రిల్ 20 : పూటకో పార్టీ మార్చే నాయకులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, అలాంటి వారికి బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని వెంకటేశ్వరకాలనీ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశం శనివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా. దాసోజు శ్రవణ్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొన్న సమావేశంలో గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కష్టంతో ఎమ్మెల్యేగా విజయం సాధించిన దానం నాగేందర్ పార్టీ మారాడని, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే అతిత్వరలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు.

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వండి

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి రవీంద్రనాయక్

ఖైరతాబాద్, ఏప్రిల్ 20 : రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మంత్రి రవీంద్రనాయక్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం గిరిజనశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమీలేదన్నారు. బీజేపీకి బలహీనవర్గాలంటే చిన్నచూపని, పార్లమెంట్, అయోధ్య మందిర ప్రారంభోత్సవాలకు సినీ, కార్పొరేట్ ప్రముఖులను పిలిచి రాష్ట్రపతి ద్రోపది ముర్ముకు ఆహ్వానం పంపలేదన్నారు. అలాంటి పార్టీలో కొనసాగడం ఇష్టం లేక రాజీనామా చేశానని తెలిపారు. ఎన్నికల్లో గిరిజనులు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, చీఫ్ కోఆర్డినేటర్ రమేశ్ రాథోడ్, మహిళా అధ్యక్షురాలు అనూష, ఓయూ అధ్యక్షులు హన్మంతు, నరేందర్, రాజశేఖర్, సతీశ్, గణేశ్, మోహన్, లింగ పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు నిర్వహించొద్దు.

మణికొండ /శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 20 : మహావీర్ జయంతి సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మాంసం విక్రయ కేంద్రాలన్నీ ఆదివారం మూసి వేయాలని మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు. శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు శంషాబాద్ మున్సిపాలిటీలో నిబంధనలు పాటించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు రావడంతో మాంసం దుకాణాదారులకు నోటీసులు అందజేశామని తెలిపారు.

టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీ వెంకన్నగుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు శనివారం అన్నదానం చేశారు. ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ విజయవంతంగా కొనసాగిస్తున్నామని సభ్యులు తెలిపారు.

- మైలార్‌దేవ్‌పల్లి

మన దేశం.. సర్వమతాల సమ్మేళనం

సర్వమతాల సమ్మేళనం మన దేశం అని, సోదరాభావంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధ్యమని రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వెంకటరమణ అన్నారు. శనివారం రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లిం సోదరులతో ఈద్ మిలాఫ్ నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు, విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- వ్యవసాయ యూనివర్సిటీ

ఎర్లీబర్డ్‌తో ఆస్తిపన్ను వసూళ్లు వేగిరం

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 20 : ఆస్తిపన్ను వసూళ్లు వేగిరం చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2023-24 సంవత్సరం 100 శాతం దాటిన వసూళ్లతో ఉత్సాహంగా ఉన్న యూసుఫ్‌గూడ 19వ సర్కిల్ అధికారులు ఈ ఏడాది 20 రోజుల్లోనే రూ.5 కోట్లపైన వసూలు చేశారు. ఈ ఆఫర్‌కు మరో 10 రోజులు గడువుండడంతో పన్ను వసూలు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చెందిన పన్ను ఏప్రిల్ నెలలో చెల్లించిన వారికి ఎర్లీబర్డ్ ఆఫర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రాపర్టీ ట్యాక్స్‌ను ముందుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నారు. ఏప్రిల్ 30 వరకు చెల్లించిన వారికి రాయితీ అవకాశం వర్తిస్తుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. పన్ను ముందుగా చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ సేవాఇస్లావత్ ప్రజలను కోరారు.

యూసుఫ్‌గూడ కార్యాలయంలో పన్ను స్వీకరిస్తున్న సిబ్బంది

ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్, ఏప్రిల్ 20 : ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఆక్రమణలను షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. సర్వే నం.102 /1లోని టీఎస్ నం. 1, బ్లాక్ – జే. వార్డు 12 పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యే కాలనీలోని 1000 గజాల ప్రభుత్వ స్థలాన్ని సునీల్ రెడ్డి క్లెయిమ్ చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ఈ స్థలం తమదని ఉండడంతో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వివిధ రకాలైన వివాదాలు న్యాయస్థానాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్నిరోజులుగా ప్రభుత్వ స్థలంలో గదుల నిర్మాణం చేయడంతో రంగంలోకి దిగిన రెవెన్యూ సిబ్బంది శనివారం వాటిని కూల్చేశారు.

నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం తెలిపారు. శనివారం శంషాబాద్ పట్టణంలో వివిధ కూడళ్లతో పాటు రాంగ్ రూట్లో వాహనాలు నడిపిన వారిపై 20 కేసులు నమోదు చేశామని వివరించారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

- శంషాబాద్ రూరల్

స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 20 : స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు రౌడీషీటర్లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్ నం.11లో ఉంటున్న మహిళ 12న తన కుమార్తెను స్కూల్‌బస్ ఎక్కించేందుకు రోడ్ నం.10లోని యూకోబ్యాంక్ మీదుగా వెళ్తున్నది. యాక్టివా మీద వచ్చిన ఇద్దరు మెడలోంచి రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఘటనపై ఫిర్యాదు అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు మహ్మద్ సొహైల్ అలియాస్ సోను, షేక్ షకీర్‌గా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. యాకుత్‌పురలోని గుడ్డి బౌలి నివాసి అయిన మహ్మద్ సొహైల్ దబీర్‌పుర పీఎస్‌లో రౌడీషీటర్. పలు పీఎస్‌లలో 16 కేసుల్లో నిందితుడు అని, సంతోష్‌నగర్ పరిధిలోని కళందర్ నగర్‌లో ఉంటున్న షేక్ షకీర్‌పై 20 కేసులున్నట్లు తేలింది. చోరీకేసులో జైలుకు వెళ్లి వారం క్రితమే విడుదలైన వీరు శంషాబాద్ సమీపంలో యాక్టివాను చోరీ చేసినట్లు గుర్తించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు..

వెంగళరావునగర్, ఏప్రిల్ 20 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాకు చెందిన సెబాకూ సులేమాన్ అలియాస్ సెనాకూ అతడి మిత్రుడు సాయి సంతోష ఆదిత్య అలియాస్ ఆదిత్యతో కలిసి మధురానగర్, రహ్మత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టారు. శుక్రవారం రాత్రి యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేపట్టారు. వీరి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయి లభ్యం కావడంతో అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

పెండ్లి పేరుతో మోసం.. వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 20 : పెండ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. భగత్‌సింగ్ కాలనీకి చెందిన లక్ష్మికి పెండ్లైకుమార్తె ఉన్నది. భర్త తాగివచ్చి వేధింపులకు గురిచేస్తుండడంతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. వరికుప్పల మల్లేశ్ పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానని.. పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆరేండ్లుగా సహజీవనం చేస్తున్నారు. పెండ్లి చేసుకోవాలని నిలదీయగా ఏదో కారణంతో తాత్సార్యంచేస్తున్నాడు. మోసం చేశాడంటూ బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉన్నది.

ప్రేమించాలని వెంటపడుతున్న యువకుడిపై..

బంజారాహిల్స్, ఏప్రిల్ 20 : ప్రేమించాలని వెంటపడుతున్న యువకుడిపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉంటున్న యువతికి హన్మకొండకు చెందిన మణికంఠ పరిచయమయ్యాడు. కొన్నాళ్లపాటు వారు స్నేహంగా ఉన్నా.. ఇటీవల అతడిపై అనుమానం రావడంతో దూరం పెట్టింది. దీంతో ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నాడు. నలుగురు స్నేహితులతో యువతి ఇంటికి వచ్చి హెచ్చరికలు చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

‘ మోడల్ పరీక్షతో అవగాహన పెరుగుతుంది ’

మోడల్ పరీక్షలతో అవగాహన పెరుగుతుందని ఓయూ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడలోని న్యూ చైతన్య కాలేజీలో జరిగిన మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షల మోడల్ ప్రశ్నాపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు గ్యార నరేశ్, నెల్లి సత్య, కల్యాణ్, రంజిత్ పాల్గొన్నారు.

- హిమాయత్‌నగర్

తాళం పగులగొట్టి చోరీ

ఖైరతాబాద్, ఏప్రిల్ 20 : తాళం పగులగొట్టి సొత్తు, నగదు చోరీ చేసిన ఘటన ఖైరతాబాద్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిమ్స్ వైద్యుడు ఫరాజ్ అశ్వక్ లడ్డీకాపూల్‌లోని మెహిదీప్లాజా అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నారు. 17న ఇంటికి తాళం వేసి వెళ్లగా, గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బెడ్‌రూం కప్‌బోర్డులోని ల్యాప్‌టాప్, వాచ్, ట్యాబ్, రూ.5వేలకు పైగా నగదు అపహరించుకెళ్లాడు. ఆలస్యంగా గుర్తించిన డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా హబీబ్‌నగర్‌కు చెందిన మహ్మద్ మాజీద్‌గా గుర్తించారు. అతడిపై హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలో దొంగతనం కేసులున్నాయి. నిందితుడిపై కేసు నమోదు చేసి రూ.1,400 రికవరీ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

బుద్వేల్ కోట మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు కొనసాగిన యజ్ఞంలో స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన యాగంలో భక్తులు పూజలు చేశారు.

- బండ్లగూడ